



— విద్యార్థి

ఎప్పటిలానే ఆ నలుగురూ కుర్చీల మీదా, మెట్ల మీదా సర్దుకొని కూర్చున్నారు. ఇంకో ఇద్దరు రూం గుమ్మాని కానుకొని నుంచొన్నారు.

అందరిలోకీ. శర్మే వింగ్ లీడర్ అని నా అభిప్రాయం.

అలాగే అతడో 'మెట్ల వేదాంతి' అని కూడా నేనభిప్రాయపడుతుంటాను.

పిప్పేళ్ళ బస్తాకి బట్టతల ఉంటే ఎలా ఉంటుందో శర్మ అలా వుంటాడు. అంత పొడవూ కాదు. అంత సన్నమూ కాదన్న మాట. అలాని అంత లావూ కాదు. వేసవి కాలంలో పండిన టమాటాలా ముడతలు పడుతూన్న మొహంతో అదోలాంటి వ్యంగ్యమైన నవ్వుని మొహాన్నతికించుకొని చూస్తే పెద్ద తరహాగా వుండి ఇంకా పాతికైనా దాటని కుర్రకారు భుజం మీద చేతులేసి తరచూ జగదాంబ సెంటర్‌లో కనపడుతుంటాడు నలభయ్యేళ్ళ శర్మ.

ఆ పక్కనే 'శారదాంబ' బార్ వుందనేది జగద్విదితం.

మా పక్కరూంలో వుండే సూరిబాబుకి పూజ (మందు కొట్టడం), భజన (అంటే చతుర్ముఖ పారాయణం) ధూపదీప నైవేద్యాలతో (సిగిరెట్టూ జర్దాపాన్ వగైరాలు వినియోగించుట) అర్చించటం. ఈయనే నేర్పాడు. ఇప్పుడు సూరిబాబు వీరభక్తుడయి పోయి ఎల్లప్పుడూ భక్తిపారవశ్యంలో మునకలేస్తున్నాడు.

తనతోపాటు ఇంకా భక్త బృందాన్ని తయారు చేశాడు.

అందరూ పాతికేళ్ళలోపే వుంటారనీ వాళ్ళ భుజాలపై చేతులేసి శర్మ తిరుగుతుంటాడనీ చెప్పేను కదా; అప్పుడప్పుడూ డోసెక్కువై వాళ్ళ భుజాలపై వేళ్ళాడిపోవటమూ కద్దు. ఒక్కోసారి అతడి భారీ కాయాన్ని భుజాలపై మోస్తూ ఏ ఆటోలోకో చేరవేసి, శారదాంబలో బిల్ కట్టేసి సూరిబాబూ, అతడి మిత్రబృందం రూంకి వస్తారు.

ఆయనో మధ్యతరగతి ఉద్యోగి.

ఈ సూరిబాబూ అతడి మిత్రులూ ఉన్నతోద్యోగుల పిల్లలు. సూరిబాబు తండ్రి ఓ పట్టణానికి ఛైర్మన్ అట కూడా!

సరైన 'గైడెన్స్' కోసం వీళ్ళూ, ఆర్థిక సాయం కోసం అతడూ కలిసిపోయారనుకుంటాను. లేకుంటే ఈ విచిత్ర స్నేహబంధానికి మరో కారణం కనబడదు.

వీళ్ళెప్పుడు సమావేశమైనా దాన్ని శర్మే లీడ్ చేసేవాడు. నానారకాల కథలూ కబుర్లూ చెప్పి అందరినీ రంజింప చేసేవాడు. ఇప్పుడూ అదే జరుగుతోంది.

మిగతా ఐదుగురినీ తన 'హాఫ్ సెంచరీ' అనుభవాలతో నోళ్ళు తెరిపింపచేసి సంభాషణను రసకందాయకంలో పడేశాడు. సూరిబాబు నోరు తెరుచుకు వింటున్నాడు. శరత్, ప్రభులు థ్రిల్లైపోతున్నారు. వాళ్ళు ముగ్గురూ రూంమేట్స్.

నేను లోపల మా రూంలో కూర్చొని వాళ్ళని కిటికీలోంచి చూస్తూ టీ తాగుతున్నాను. నిజానికి ఈ టైంకి నేనూ, శంకరూ జగదాంబా సెంటర్‌లో టీ తాగుతూ, సిగిరెట్లు ఊదుతూ దారినపోయే మిడ్డీ ఫ్రాక్ జానీనో, పచ్చ చీర భామానో ఏడిపిస్తూండాలి.

కానీ నెలాఖరు కావటంతో రూం దాటి పోయేందుకు వెనుకాడుతున్నాను.

పక్క రూంలో వాడేగా సూరిబాబు నడగ

మన్నాడు శంకర్. కానీ ఆ స్థాయివాడితో మాట్లాడేందుకు కూడా పనికిరాననే అభిప్రాయం వుండటం వల్ల అడగలేకపోయాను.

మా రూం గందరగోళంగా వుంది. పుస్తకాలు చిందరవందరగా వున్నాయి. వాటి మధ్య మనోహర్ కూర్చొని వున్నాడు. అతడి చేతిలో 'ఫర్ ది న్యూ ఇంటలెక్చువల్స్' అనే అయాన్ రేండ్ బుక్ వుంది. దాన్ని బట్టీ వేస్తున్నట్టున్నాడు.

బట్టీ ఎందుకంటే ఏ సమావేశంలోనో, మిత్రుల ముందో 'ఠపీ'మని ఓ కొటేషన్ చెప్తాడు. వాళ్ళు గుడ్లప్పగించి చూస్తుంటే గర్వంగా, చెమటలు పట్టిన మొహాన్ని తుడుచుకుంటూ ఆనందంగా చెప్తాడు 'ఫలానా వాళ్ళదీ కొటేషన్' అని.

మనోహర్ నా రూంమేటేగానీ అతడినీ డబ్బడగలేను. అడిగి తేలికైపోదలుచుకోలేదు.

పట్టణాలకి వలస వచ్చి బతికే అనేక మంది విద్యార్థులకు నేను ప్రతినిధిని. ఇక్కడి మెరుపుల, మెరుగు కాగితాల జీవితానికి ఆకర్షింపబడీ, అందుకు స్థోమతు లేక నరకాన్ననుభవించే యువతలో నేనొకడిని.

శర్మ పిలుపుతో నా ఆలోచనలు ఆగిపోయాయి.

ఆయన లోనికొచ్చి నన్ను అడిగాడు.


"ఓ సమస్య వచ్చిందోయ్. మా తమ్ముడు ఊర్నించీ వస్తున్నాడు. ఓ నెల రోజులు మీ రూంలో వుండటానికి కుదురుతుందా? తప్పని సరై అడుగుతున్నాను. మా ఇల్లు సంగతి తెలిసిందేగా. మాకే చాలదు. చాలకపోవటం అటుంచు. వాడి చదువు చెడిపోతుంది. ఏదో... నీతోపాటు చదువుతాడు ఏమంటావ్?"

శర్మకి సదాశివపేటలో ఓ పసుప్పచ్చ క్వార్టరుంది. ఆ కాలనీ ఇల్లు ఇరుగ్గానే వుంటుంది. కానీ మా సంగతేమిటి? మనోహర్ వైపు చూశాను.

అతడు మొహమాటానికి ఓ నవ్వు నవ్వి ఎలాగో కానీమన్నాడు.

"సరే ఎగ్జామ్స్ వరకూ వుండొచ్చనుకోండి. కానీ భోజనం మాటేమిటి?"

"ఏదో ఒక హోటల్లో చేస్తాడ్లే. అలాంటివేం పెట్టుకోకు. ఇప్పటికే ఇబ్బంది పెడుతున్నాను. ఎల్లుండి సాయంత్రం వాడిని పంపిస్తాను వుంటావా..." అంటూ హడావిడిగా వెళ్ళిపోయాడు.




అంటే ఈ నెల రోజులూ నాక్కూడా ఇబ్బందిగానే వుంటుందన్నమాట.

మామూలుగా ఎవరినీ అనుమతించని నేను శర్మకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చానంటే బహుశా ఏమూలో ఆయనకి దగ్గరవ్వాలనే ఆలోచన లోపల వుంచుకున్నాననుకోవాలి. ఆయన ద్వారా సూరిబాబు బ్యాచ్‌కి దగ్గరవ్వాలని కూడా.

ఇవన్నీ మనోహర్‌కి తెలిస్తే మండిపడతాడు. అతడికిలాంటివి పడవు. తన మేధా ప్రపంచంలో తనుంటాడు.

* * *

ఓ వారం గడిచింది.

జగదాంబా సెంటర్ నుండీ కాళ్ళీడ్చుకొంటూ వస్తున్నాను.

మనియార్డరు ఇంకా రాలేదు. ఇంట్లో వాళ్ళు ఏం చేస్తున్నట్లు? వాళ్ళ మీద కోపం వచ్చింది.

వాళ్ళననుకోకూడదనీ, డబ్బు జాగ్రత్తగా వాడాలనీ అనుకొంటాను. కానీ ఇక్కడ శంకర్ గాడితో రెండ్రోజులు తిరగంగానే వున్నవన్నీ అయిపోతాయి. ఆ రెండు రోజులూ మరో లోకంలో తిప్పుతాడు వాడు. సిగిరెట్లూ, టీలూ, చికెన్ మంచూరియాలూ, ఎ.సి. థియేటర్‌లో పది రూపాయల టిక్కెట్లూ, ఆటోలూ... ఫినిష్ అయిపోతుంది. రూం రెంట్‌కీ, తిండికీ చాలదు మిగిలిన డబ్బు.

నేను ఊరి నుండీ వచ్చేప్పుడు అమ్మ, తమ్ముడు, అక్క... వీళ్ళంతా గోడల కానుకొని నన్ను విచారంగా గమనిస్తుంటారు. అయిష్టంగా నేను సామాను సర్దుకొంటుంటే సాయపడతారు.

మా ఇల్లు గుర్తుకి రాగానే గుండె బరువెక్కింది.

ఆలోచనల్లో రూంకి చేరుకున్నాను.

అప్పుడే ఓ కొత్త యువకుడు.. ఇరవై పైన వయసు వుంటుందేమో లోపల కూర్చొని వున్నాడు.

నన్ను చూసి లేచి చెప్పాడు.

"నేను.. శర్మగారి.. మా అన్నయ్యే శర్మ" అన్నాడు.

అప్పుడు గుర్తొచ్చింది. అతడి పేరు హరి.

అలా వచ్చిన హరిని మిగతావాళ్ళెవరూ పట్టించుకోలేదు.

మావాళ్ళ కంత తీరిక వుండదు కూడా.

శర్మలా ఇతడు సూరిబాబు ప్రభువాళ్ళతో కలవకపోవటం గమనించాను. మనోహర్ మాత్రం అతడిని మాటల్లో పెట్టే ప్రయత్నం చేసేవాడు. కానీ అతడు పడనీయలేదు.

హరి మధ్యాహ్నం వరకూ చదువుకొని సాయంత్రాలు బయటికి పోయి రాత్రి తిరిగొచ్చేవాడు. సినిమాకయితే వెళ్ళడని నా నమ్మకం.

కానీ అడిగితే బాగోదని ఊరుకున్నాను.

లైబ్రరీకి వెళ్తానని అన్నాడుగానీ అతడేదో శారీరక శ్రమ చేస్తున్నాడని నా అనుమానం. భోజనం కూడా సరిగా చేసేవాడు కాదనుకుంటాను. ఆకలిచూపులు కనపడేవి.

ఏదో ఆర్థిక సమస్యలయి వుంటాయి. పట్టించుకొనే ఉత్సాహం నాకయితే లేదు. శర్మేం చేస్తున్నట్లు?

డబ్బులు కొంత పొదుపుగానేవాడుతున్నాను.

ఫస్ట్‌షో చూసి ఇప్పుడే వస్తున్నాను. చదవాలి అనే కోరిక వుంది గానీ దాని దుంపతెగ రేపట్నించీ వంచిన తల ఎత్తకుండా చదవబోతున్నాననే ఉత్సాహంతో సినిమా చూడక తప్పలేదు. ఆ హుషారులో ఈల వేస్తూ వస్తుంటే ఓ సందులోంచి హరి వస్తూ కనిపించాడు.

నన్ను చూసి ఇబ్బందిగా నవ్వాడు. ఆ సందులో లైబ్రరీ లేదని నాకు తెలుసు.

ఇతడి సందేహాస్పదమైన తిరుగుళ్ళ గురించి శర్మకి చెప్పాలా? వద్దా?

పైపైన మాటలాడుతూ రూంకి చేరాము.

ప్రభువాళ్ళ రూంలో టేప్ రికార్డర్ హోరెత్తుతోంది. అంటే మందు ప్రవహిస్తోందన్న మాట.

డబ్బుంటే నేనూ ఎంజాయ్ చేద్దును. ప్రభువాళ్ళ నాన్నగారు ఒక పెద్ద డాక్టర్. సూరిబాబూ అంతే. వాళ్ళతో మాట్లాడాలంటే గిల్టీగా వుంటుంది.

ఏ కలెక్టర్ ముందో నిలబడ్డ కండక్టర్‌లా...

వాళ్ళూ అంతే. నన్ను పట్టించుకోరు. నాకా స్థాయి లేదని ఇన్‌డైరెక్ట్‌గా చెప్తుంటారు.

హరి తలుపు తట్టినా మనోహర్ తీయలేదు.

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి
భీమ సిమెంట్

మామూలుగా ఇది చదువుకొనే టైం. అతడిని తప్పకోమని నేను గట్టిగా కొట్టటం మొదలు పెట్టాను. అయినా తలుపు తీయటం లేదు.

బాదటం మొదలయ్యాక లోపల హడావుడి శబ్దాలు వచ్చాయి. మనోహర్ 'ఓయ్' అన్నాడు.

అన్నాడేగానీ తలుపులు తెరవడు.

''తలుపు తీయరా ఇడియట్'' అన్నాను.

''అప్పుడే వచ్చావా? ఫస్ట్ షో అయ్యిందా?''

''ముందు తలుపు తియ్యి. తర్వాత క్షేమ సమాచారాలు''

''చంపావు కదరా! లోపల నీలవేణి వుంది''

''నీలవేణి వుండడమేమిటి? ఇప్పుడెందుకు వచ్చింది? పొద్దునే వచ్చి రూం ఊడవమన్నాను కదా?''

హరి నన్ను వెనక్కి లాగాడు.

అతడి కళ్ళల్లో ఏదో భావం నన్ను పరిస్థితి అర్థం చేసుకొనేలా చేసింది.

మనోహర్ లాంటి మేధావికి నీలవేణి కావల్సి వచ్చిందా? ఇంత కాలం ఈ సంబంధాలకి కారణం ఆ 'అవసరం' అనే అనుకొన్నాను. కానీ ఇక్కడ ఆ అవసరం ఎండిన మోడులాంటి నీలవేణికి లేదని తెలుసు. డబ్బు అనే అవసరం తప్ప.

''సెకెండ్ షో అందుతుందా?'' హరి అడిగాడు. తేలికగా కనపడుతూ.

ఇద్దరం నిశ్శబ్దంగా నడిచి ఓ షాపు ముందు మెట్ల మీద కూర్చున్నాం. నేనుసిగరెట్ వెలిగించాను.

మనోహర్ కూడా. ఆఖరికి ... ఎండిన మోడు లాంటి నీలవేణితో ... ఏదోలాంటి ఫీలింగ్... బార్‌కి వెళ్ళిన వాడిని చుట్టూ తాగే వాళ్ళు గమనిస్తున్నట్లు, నన్ను చూసి 'పవిత్రుడురోయ్' అని నవ్వుకొంటు న్నట్లు!

నాలుగు రోజులు ఆలోచిస్తూ వుండిపోయాను.

* * *

హరి అజాపజా లేదు. రెండు రోజుల్నించీ రూంకి రాలేదు. ఏమయిందతడికి? శర్మ ఓసారి ఖంగారుగా అడిగిపోయాడు హరి గురించి.

అయితే తర్వాత రోజు హరి కనిపించాడు. ఇబ్బంది కరమైన పరిస్థితిలో ... ఇద్దరికీ

నేను తల ఎత్తి చూడలేకపోతున్నాను. ఇలా పోలీస్ రైడింగ్‌లో దొరికి పోతాననుకోలేదు. కలలో కూడా... అందులో బ్రోతల్ హవుస్‌లో ... మనోహర్ ప్రోద్బలంతో నా డబ్బుతో ఇద్దరం వెళ్ళాము.

మనోహర్ మాత్రం తప్పించుకొని రాకెట్‌లా దూసుకు పోయాడు. నేను అనుభవం లేని కారణంగా దొరికి పోయాను. బూతులూ... తన్నులూ ... చొక్కా విప్పి రోడ్డు మీద నడిపించటమూ కొత్త అనుభవాలు నాకు ... ఒళ్ళు హూనమయింది. లాకప్ రూంలో పడి వున్నాను. చొక్కా లేకుండా.

ఇంతలో హరిని మూటలా దొర్లించి వెళ్ళారు. అతడినీ చావకొట్టినట్లుంది. నా బ్రోతల్ మేట్స్ అతడిని చూసి గుసగుసలాడుకొంటే తెలిసింది, అతడో ఉద్యమకారుడని. తన సహచరులతో ఏవో పోస్టర్లు అంటిస్తుండగా దొరికి పోయాడట.

హరికూడా వాళ్ళల్లో ఒకడని తెలిసాక ఆశ్చర్య మేసింది.

రాత్రిళ్ళు తిరగటం ... చిన్నతనంలోనే ఆశయాలూ ... ఉద్యమాలూ ... నాకు తెలీని ప్రపంచం అతడిది.

నన్ను చూసి క్షణంలో ఊహించాడు నేనెందుకు లాకప్‌లో వున్నానో. అదేం పట్టించుకోనట్లా అడిగాడు.

''మనిషిగా పుట్టాక ఏదోకటి సాధించాలి అవునా?''

''అవును'' అన్నాను సిగ్గుగా.

అవును. ఏం సాధించాను. చదువు సరిగ్గాలేదు. కష్టపడే స్వభావం లేదు. ఏదొకటి చేయాలని చివరికి ఈ సాధనలో ఇక్కడున్నాను.

''ఇదీ నేనుసాధించింది'' అన్నాడు. తన వంటిపై గాయాలని చూపిస్తూ హఠాత్తుగా అడిగాడు.

''ఎందుకు? ఎందుకని మన యువతరం ఇలా నిర్వీర్యమవుతోంది? మనకింత నిరాసక్తత ఎందుకు? అడుగడుగునా ఇన్‌ఫీరియారిటీ ... లక్ష్యాలూ ... ఆశయాలూ లేకుండా బతకటం ... ఇలా తగలడిందేమిటి మనతరం''

''అసలు ఎవరి గురించి మనం బ్రతుకుతున్నాం? మన గురించి కాదూ? మనం ఉన్నతంగా జీవించాలని కాదూ? మీరంతా సమాజం గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా కళ్ళులేని కబోదుల్లా నిరామయంగా తిరుగుతారెందుకు?'' అమ్మాయిలూ... మందూ... పార్టీలూ ... విశృంఖలత్వం... అదే లైఫ్ అనుకోవటం''

నేను కోపంగా చూశాను. అందరూ అతడిలా ఉద్యమకారులైపోవాలా?

''నేనునాలాగే వుండమనడం లేదు. నా మార్గం సరైందని వప్పించటానికి నాకిప్పుడు ఓర్పులేదు. ఇది సమయం కాదు. కానీ ఏదో ఒకటి. సమ్‌థింగ్. లక్ష్యం పెట్టుకోండి. దాని గురించి పోరాడడం నేర్చుకోండి.

బహుశా మా వాళ్ళు కూడా నా వాదనకి ఒప్పుకోరేమో. పరిస్థితులూ సమాజమే దీనికి కారణం అంటారు. ఏమయినా మన యువతరం గురించి ఇంకా నేర్చుకోవలసే వుంది. అధ్యయనం చేయాల్సి వుంది. ఏమంటారు?'' అడిగాడు.

నాకంత జ్ఞానం లేదు. నిజంగా సిగ్గుపడ్డాను.

ఇంతలో శంకర్ వచ్చాడు నా కోసం. డబ్బు కట్టేసి తీసుకెళ్తుంటే నేను హరి వైపు చూశాను. అతడూ నా వైపే చూశాడు.

''వెళ్ళండి. నా కోసం ఎవరూ రారు. వచ్చినా వీళ్ళు వదలరు'' అన్నాడు.

బయటకు నడిచాను.

శర్మకి చెప్పి త్వరగా పంపించాలి. హరికి బెయిల్ దొరకొచ్చు. అసలు హరి ఇలా అని శర్మకి తెలుసో లేదో?

శర్మ మా రూం దగ్గరే సూరిబాబుతో మాట్లాడుతున్నాడు.

''ప్రజల కోసం ఒకడిని అర్పించలేరా?'' సూరిబాబు జోక్ చేస్తున్నాడు హరి గురించి.

శర్మ నవ్వుతున్నాడు బలవంతంగా.

అంటే అతడి కంతా తెలిసిపోయిందన్నమాట.

నన్ను చూసి అన్నాడు.

''వాడొక్కడే తప్పు బుట్టాడండీ మా ఇంట్లో. బరువూ బాధ్యతలూ లేవు. వెధవ మిమ్మల్ని చూసి ఏమయినా నేర్చుకుంటాడనుకుంటే ... ఛ... ఇక్కడా అదే పనులు ... దరిద్రుడు ... బాగుపడే రకంగాదు'' బాధగా అంటున్నాడు.

నేర్చుకోవాలి ... మారాలి మిమ్మల్ని చూసి ... !!!

నేను తెల్ల మొహం వేసుకుని చూస్తున్నాను.

ఎవరు ఎవర్ని చూసి నేర్చుకోవాలి? ◆

---

అనుభవాన్ని అనుభవంగా మనకు అందివ్వగలిగేది ఒక్క సాహిత్యం మాత్రమే. అనుభవాన్ని వ్యక్తం చెయ్యడమే కాదు—అది మనకు అనుభూతమయ్యేటట్టు చేస్తుంది. ఇదే సాహిత్యం ప్రత్యేకత. శాస్త్రానికీ, తత్వానికీ సాధ్యంకాని పనులివి. ఈ అవసరం నిమిత్తమే మనిషి సాహిత్యాన్ని సృష్టించుకున్నాడు.

— ఇస్మాయిల్

సేకరణ— ఈదువల్లి